# 'రాగాల సంతకం'

కొన్నేళ్ల క్రితం మా పెదబావగారి అపరకర్మలకు హంపీ క్షేత్రానికి వెళ్లాల్సి వచ్చింది.

హంపీ గురించి నే ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు.

ఆ గత వైభవ చిహ్నాలూ...

శిథిలాలై శకల శకలాలుగా పరుచుకుపడుకున్న నాటి శిల్ప కళా వైభవం... రాళ్లల్లో ఘనీభవించిన సౌందర్యం...

అలుక్కుపోయిన చరిత్ర పాఠ్యపుస్తకపు పేజీల్లాంటి కట్టడాలూ...

కళ్లు మూసుకుంటే ఒక్కొక్కరికీ ఒక్కోవిధంగా సాక్షాత్కరించే అయిదువందల ఏళ్లనాటి మహాద్భుత చిత్రం.

నాకు హంపీ స్ఫురించినప్పుడల్లా చరిత్రలో చదువుకున్న పాంపెయీ గుర్తుకు వస్తుంది. పాంపెయీ అగ్నిపర్వత ఆగ్రహానికి శిథిలమయింది.

సరే హంపీ అయినా మరో మహా పుణ్యక్షేత్రమయినా నా అలవాట్లకు భంగం వాటిల్లకుండా చూసుకుంటాను. హంపీలో అన్నీ సజావుగానే దొరుకుతాయి. మనకు ఢోకాలేదు.

ఓ రాత్రి సరంజామా పుచ్చుకుని విరూపాక్ష దేవాలయానికి దూరంగా అలా అలా నడుచుకుంటూ వెళ్లి చదునుగా వున్న బండరాళ్ల మీద కూచున్నా.

శుక్ల ద్వాదశి... బూడిద చల్లినట్టు వెన్నెల.

గోగుపువ్వులు విరబూసినట్టు వెన్నెల. శిథిలమూ, సజీవమై ఎప్పటివో వెనకటి పాటలు పాడుతున్న నిశ్శబ్ద శబ్దాలు. మనస్సంతా ఓ అపూర్వ రాగభావనా సౌరభం. తుంగభద్ర మీంచి గాలులు  చల్లగా  వీస్తున్నాయి. వెన్నెలాకాశంలో తెల్లటి కొంగలు శబ్దం. చేస్తూ వెళ్తున్నాయి. రఘువంశ శ్లోకం కాళిదాసుని నాముందుంచింది. 'శ్రేణీ బంధాద్వి తన్వద్భిర స్తంభాం తోరణ స్రజమ్ సారసైః కలనిర్హ్రాదైః స్మరించుకున్నాను.

ఇంతలో ఎక్కడిదో వేణుగానం. ఆ వెన్నెల కాంతికి సౌరభాల్ని అద్దుతూ... తుంగ భద్రానదీ తరంగాల మీంచీ వస్తున్న చిరుగాలుల్లో అలలు అలలుగా కొట్టుకొస్తూ...

కాసేపు ముక్కలు ముక్కలుగా వినిపించన వేణుగానం మనసును సంధించి వింటే ఏకసూత్రంగా వినిపించసాగింది. 'ఒక్కోస్వరమూ విదితమవుతోంది. తెలిసిపోతోంది. ఆ

వెన్నెల రాత్రి నాకు వినిపిస్తున్నది ఘూర్జరీ తోడి. అది దివా ద్వితీయ యామాన ఆలపించ వలసిన రాగం. కానీ ఆ నదిరేయి...? ఎవ్వరిది అత్యంత హృద్యంగా... విషాదాన్ని మేళవించి ఆ వేణుగానం చేస్తున్నది? మనస్సును రిక్కించాను. రాగం మారింది. మధ్యమ నిషాదాలు మాయమై భూపాల్ తోడి పలుకుతోంది.

నేను నా సరంజామా సర్ది భుజానికి వేల్లాడే సంచీలో వేసుకుని, ఆ రాగ సుగంధాల్ని పట్టుకొని అలా అలా నడిచి వెళుతున్నా... ఆ రాగ సౌరభాలు నన్ను తుంగభద్ర వొడ్డుని వున్న మంటపానికి తీసుకెళ్లాయి.

అప్పటికే భూపాల్ తోడి లాచరీ తోడిగా పరిణమించింది. ఆ రాగం కూడా దివా ద్వితీయ యామాన పాడవలసిన రాగమే.

ఎవ్వరు ఎవ్వరీవిధంగా గాన కాలాన్ని విస్మరించి తద్భిన్నంగా నదిరాతిరి ఆ రాగాలాపనలు చేస్తున్నారు? అనుకుంటూ చిన్నగా మెట్లు దిగి ఆ మంటపంలోకి వెళ్లాను.

గలగల పారుతూన్న తుంగభద్ర జలాల్లోకి కాళ్ళు రెండూ జారవిడిచి ఓ వృద్ధుడు ప్రకృతిలో లీనమై వేణువు వాయిస్తున్నాడు.

వెన్నెలా తలా... వెండి గడ్డమూ... అతని పక్కనే ఓ స్త్రీమూర్తి. శరీరమంతా చెవులై ఆ మహాద్భుత వేణుగానాన్ని తన శరీరపు అణువణువునా యింకించుకుంటూ... అతనూ... ఆమే...వాళ్లిద్దరి మధ్యా రాగాను సంధానంగా వేణువుల పెట్టె... ఆ పెట్టెనిండా వేణువులు.

అతను గానం ఆపాడు. వాయిస్తున్న వేణువును పెట్టెలో పెట్టాడు. నిశ్శబ్దం... తుంగభద్ర గలగల మనడానికి కూడా సందేహిస్తున్నట్టు...

ఆ స్త్రీమూర్తి వీస్తున్న గాలిలా ఏదో అంది.

అతను పెద్ద బాఁసురీ తీసాడు. మోగింది వేణువు. తుంగభద్ర మంద్ర ప్రవాహపు గలగలలు శ్రుతి.

సరిగ్గా రాత్రి రెండో యామంలో గానం చేయవల్సిన రాగం ఆ వేణూ సుషిరాల్లోంచీ ప్రవహించింది. రాగం మారూ బీహాగ్

చలనరహితంగా అట్లా కూర్చుండిపోయా.

వాళ్ళు కదలి వెళ్లిపోయేముందు నన్ను నేను పరిచయం చేసుకున్నా. ఆ మహాను భావుడి పేరు సుధీర్‌కుమార్ చక్రవర్తి అని మాత్రం తెలుసుకున్నా. ఆ తల్లి పేరు అడిగే స్పృహ కూడా నాకు లేదు. బెంగాలు ప్రాంతం వాళ్ళు అన్నది మాత్రం తెలిసింది.

ఈ రోజున వాళ్ల చిరునామా తీసుకోలేదన్న అపరాధ భావన నాకు లేదు. వాళ్ళు నా గుండెల మీద పెట్టిన సంతకం శాశ్వతం. ఎప్పుడు వెళ్లినా హంపీ క్షేత్రంలో ఆ తుంగభద్రానదీ తీర పవనాల్లో వాళ్ళు శాశ్వతంగా రవళిస్తూనే ఉంటారు. ●